సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025

నవమి వేడుకలకు వేళాయె..



కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామాలయం శ్రీరామ నవమి వేడుకలకు అందంగా ముస్తాబయింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ వర్గాలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేసి.. విద్యుద్దీపాలు అలంకరించారు.

ఖైదీ.. జై జైలు





జైలు కాలం...నవ జీవన రాగం • ఖైదీల్లో ఆర్థిక స్వావలంబన

పలు కర్మాగారాలతో ఉపాధి కల్పిస్తున్న విశాఖ కేంద్ర కారాగారం

ఖైదీలతో వివిధ ఉత్పత్తి విభాగాల నిర్వహణ

ఏడాదిలో కారాగారం నుంచి రూ.2 కోట్ల విలువైన ఉత్పత్తులు

వారంతా ఏదో ఒక సందర్భంలో క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడి శిక్ష పడిన వారే. కొందరికి కారాగారం నెలరోజులైతే.. ఇంకొందరికి ఏడాది.. మరికొందరికి మూడేళ్లు... ఇలా అయినవారికి దూరంగా.. బాహ్య ప్రపంచానికి నోచుకోక.. నాలుగుగోడల మధ్య అపరాధులుగా కాలం వెళ్లదీస్తున్న వారే. ఇలాంటివారిని జీవన స్రవంతిలో శిక్షాకాలం అనంతరం క్రమ శిక్షణ, స్వయం సాధికారత, ఆర్థిక స్వావలంబనతో ముందడుగు వేసేలా తీర్చిదిద్దుతోంది విశాఖ కారాగారం. వారి కాళ్లమీద వారు నిలబడే రీతిలో నైపుణ్యాలను నేర్పిస్తోంది. పేరుకు జైలైనప్పటికీ.. ఖైదీల జీవితాలకు మేలు తలపించే కార్యక్రమాలను చేపడుతూ వారి భావిజీవితానికి బంగారు బాటలు వేస్తోంది. -ఆరిలోవ

ఈ విభాగాల్లో అత్యధిక ఉత్పత్తి

విశాఖ కారాగారంలో ఉన్న యూనిట్లలో అత్యధిక ఉత్పత్తిలో స్టీల్ పరికరాల యూనిట్ మొదటి వరసలో ఉంది. తర్వాతి స్థానాల్లో బేకరీ, చేనేత, వ్యవసాయ క్షేత్రాలున్నాయి. ఈ నాలుగు యూనిట్ల ద్వారా 2024–25 సంవత్సరంలో రూ 1.71 కోట్ల విలువైన ఉత్పత్తులు వచ్చాయి.

విభాగం	ఉత్పత్తుల విలువ (రూ.లలో)	జైలుకు సమకూరిన ఆదాయం లక్షల్లో
స్టీల్ పరికరాలు	1.35 కోట్లు	17
బేకరీ	15.30 లక్షలు	2
చేనేత	15 లక్షలు	1.60
వ్యవసాయం	5.80 లక్షలు	1.20
ఇతరములు	28.90 లక్షలు	5.70

ఆదాయార్జనలో అంతకుమించి..


పలు రంగాల ఉత్పత్తుల ద్వారా ఆదాయార్జనలో ఏటికేడు కేంద్ర కారాగారం తనదైన శైలిలో ముందడుగు వేస్తోంది. 2006 నాటి ఆదాయంతో పోల్చి చూస్తే 19 ఏళ్ల కాలంలో పదిరెట్ల పురోగతితో దూసుకుపోతోంది

8లో

సంవత్సరం	ఆదాయం (రూ. లలో)
2006	20లక్షలు
2015	40లక్షలు
2016	1.30 కోట్లు
2017	1.40 కోట్లు
2020	1.60 కోట్లు
2024	2.01 కోట్లు







బాంబు పేలుళ్లు.. గన్ ఫైరింగ్‌లు

దువ్వాడలో యుద్ధ వాతావరణం



సాక్షి, విశాఖపట్నం: శనివారం మధ్యాహ్నం.. ఒక్కసారిగా బాంబు పేలింది.. అంతలోనే గన్‌ఫైరింగ్ వినిపించింది.. బుల్లెట్ల వర్షం కురిసింది.. అక్కడ వ్యాపించిన పొగల నుంచి సైనికులు భారీ రైఫిల్స్ పట్టుకొని ఒక్కసారిగా బయటికి వచ్చారు. ఇక్కడేదైనా యుద్ధం జరుగుతోందా అనే అనుమానాలతో దువ్వాడ సమీప ప్రజల్లో ఆందోళన మొదలైంది. అది టైగర్ ట్రయాంఫ్-2025 విన్యాసాల్లో భాగంగా జరుగుతున్న కార్యచరణ అని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. మూడు రోజుల పాటు దువ్వాడ ఫైరింగ్ రేంజ్‌లో భారత్, అమెరికా దేశాల సైనికుల మధ్య ఉమ్మడి శిక్షణ కార్యక్రమం జరిగింది. చివరి రోజున యుద్ధ వాతావరణంలో ఇరుదేశాలు పరస్పర సహకారం అందించుకుంటూ.. శత్రుసేనలను మట్టుబెట్టాలనే అంశంపై విన్యాసాలు నిర్వహించారు. ఇదే సమయంలో యుద్ధం జరిగినప్పుడు.. ఓవైపు శత్రువులతో పోరాటం చేస్తూనే.. మరోవైపు గాయపడిన తోటి సైనికులకు వైద్య సహకారం అందించేందుకు ఏ విధమైన కార్యచరణ సంసిద్ధం చేయాలన్నదానిపైనా శిక్షణ కార్యక్రమం జరిగింది. సుదర్శన్ చక్ర క్యాప్స్ నేతృత్వంలో బైసన్ డివిజన్ యాంఫీబియస్ బ్రిగేడ్‌కు ప్రాతినిధ్యం వహించిన 8 గూర్ఖా రైఫిల్స్ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ గ్రూప్, 5వ పదాతిదళ రెజిమెంట్‌లోని 1వ బెటాలియన్ (బాబ్‌క్యాట్స్), ఒకటో స్ట్రైకర్ బ్రిగేడ్ పోరాట బృందం, 11వ పదాతిదళ విభాగం (ఆర్కిటిక్ వోల్వ్స్) సిబ్బందితో కూడిన భారత ఆర్మీ బృందాలు ఈ ఉమ్మడి వ్యాయామంలో పాలుపంచుకున్నాయి. భారత్, యూఎస్ సైనికులు 100 మీటర్ల నుంచి లైవ్-ఫైరింగ్ డ్రిల్‌లు, 50 మీటర్ల వద్ద క్లోజ్-క్వార్టర్స్ కంబాట్ షూటింగ్, దట్టమైన అటవీ భూభాగంలో పరస్పర కమ్యూనికేషన్ ద్వారా కదలికలు, జంగిల్ లేన్ షూటింగ్ మొదలైన విన్యాసాలు చేపట్టారు.

ఇంజినీరింగ్ టెండరింగ్



- టీయూ 142–ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం నిర్వహణ టెండర్లలో విచిత్రం
- హోటల్ అనుభవముంటే ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇస్తామనడంపై సర్వత్రా విస్మయం
- కాంట్రాక్టర్ల అయాచిత లబ్ధికి ప్రణవిల్లుతున్న వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగం

విశాఖ సిటీ: హోటల్ నిర్వహించిన అనుభవం ఉందా? అయితే ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం మెయింటెనెన్స్ టెండర్ దక్కించుకోవచ్చు. ఆడుతూ పాడుతూ రూ.33.85 లక్షలు వెనకేసుకోవచ్చు. అలా అని ఎవరికి పడితే వారికి టెండర్ వచ్చేస్తుందనుకుంటే పప్పులో కాలేసినట్టే. ఇదంతా తమ అనుయాయులకు టెండర్ కట్టబెట్టేందుకు ప్రణమిల్లుతున్న వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారుల మాయాజాలం. వీరు తిమ్మిని బమ్మిని.. బమ్మిని తిమ్మిని చేయడంలో సిద్ధహస్తులు. తమకు కావాల్సిన వారికి రూ.లక్షలు విలువ చేసే పనులు అప్పగించేందుకు టెండర్లలో ఎలాంటి నిబంధనలైనా ఇట్టే మార్చేయగలరు. వారి అర్హతలకు తగ్గట్టుగానే టెండర్లను ఆహ్వానించి వారికే వచ్చేటట్లు చక్రం తిప్పగలరు. ఇందుకు బీచ్ రోడ్డులో ఉన్న టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం వార్షిక నిర్వహణ టెండర్లే నిదర్శనం.

టెండర్లలో విచిత్రం

టీయూ–142 మ్యూజియం నిర్వహణకు వీఎంఆర్‌డీఏ ఈ నెల 3వ తేదీ నుంచి టెండర్లను ఆహ్వానిస్తోంది. 2025 మే నుంచి 2026 మార్చి వరకు 11 నెలల పాటు ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం మెయింటెనెన్స్‌ను ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందుకు గాను కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థకు వీఎంఆర్‌డీఏ రూ.33,85,856 చెల్లించనుంది. అయితే ఈ టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టు సంస్థల అర్హతల నిబంధనలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. మొత్తం 10 నిబంధనలను పొందుపరచగా.. ప్రధానంగా షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, హోటల్స్ మెయింటెనెన్స్ అనుభవమున్న వారు ఈ టెండర్‌లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొనడం గమనార్హం. ఎయిర్‌క్రాఫ్ట్, దానిలో ఉన్న పరికరాలపై కనీస అవగాహన లేని వారిని అర్హులుగా పేర్కొనడం విశేషం.

నేవీ అధికారులు అసంతృప్తి

గతంలో టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. మ్యూజియం మెయింటెనెన్స్ సక్రమంగా లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటిలాగే ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ఎటువంటి అనుభవం లేని వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో ఎయిర్‌క్రాఫ్ట్ రూపురేఖలు మారిపోయాయి. దీనిపై నేవీ ఉన్నతాధికారులు సైతం నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో గతేడాది ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణలో అనుభవం ఉన్న వారు మాత్రమే టెండర్లలో పాల్గొనేలా నిబంధనలు మార్చారు. దాని ప్రకారం టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టు సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ పాత విధానంలోనే హోటల్ అనుభవం ఉన్న వారికి ఈ మ్యూజియం బాధ్యతలు అప్పగిస్తామనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుయాయులకు కట్టబెట్టేందుకే..!

ఈ కాంట్రాక్టు విషయంలో కూటమి నేత చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. తమ వారికి కాంట్రాక్టు కట్టబెట్టేందుకు అనువుగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు గుసుగుసలు వినిపిస్తున్నాయి. సదరు నేత సన్నిహిత కాంట్రాక్టర్ అర్హతలకు తగినట్లుగా నిబంధనలను సడలించడంతో పాటు ఈ టెండర్ వారికే దక్కేలా వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఎటువంటి టెండర్లు లేకుండా కేవలం ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో కైలాసగిరిపై బ్యాటరీ కార్లకు అనుమతులివ్వడం వివాదాస్పదమైంది. దీంతో ఆ బ్యాటరీ కార్ల అనుమతులు రద్దు చేయాల్సి వచ్చింది. దానికి మళ్లీ ఇప్పుడు వేలం ప్రక్రియ చేపడుతున్నారు. తాజాగా ఈ టీయూ–142 విషయంలో కూడా సరైన నిర్ణయం తీసుకోని పక్షంలో పర్యాటకుల ముందు పరువు పోగొట్టుకోవాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రైవేటు షాపులకూ ఆశీలు!





ఈ బోర్డు పూర్ణామార్కెట్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఇందులో ఏయే షాపుల నుంచి ఎంత మొత్తం వసూలు చేయాలనేది స్పష్టంగా పేర్కొంది. ఇందులో కారు పార్కింగ్ కోసం రూ.10 వసూలు చేయాలని ఉంది.



ఈ రశీదు ఆశీలు కాంట్రాక్టరు అనధికారికంగా జీవీఎంసీ లోగో, కమిషనర్ పేరుతో ముద్రించినది. ఈ రశీదుతోనే కారు పార్కింగ్ కోసం రూ.20 వసూలు చేస్తున్నారు.

- పూర్ణామార్కెట్‌లో కొత్త దందా
- షాపులకు సరుకు వెళ్లనీయమంటూ బెదిరింపులు
- అధికారి పార్టీ చోటా నేత వసూళ్ల పర్వం
- చేపల మార్కెట్ బుట్టలకూ పైకం చెల్లించాల్సిందే..
- జీవీఎంసీ లోగోతో అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/జగదాంబ

పరిధి మించి..

కార్పొరేషన్ గెజిట్‌తోపాటు ఆశీలు వసూలుకు జీవీఎంసీ పరిధి నిర్ణయించింది. మార్కెట్‌లో ఏ, బీ, సీ, డీ కేటగిరిలు కింద 750 దుకాణాలు ఉంటే.. మరో 750కి పైగా దుకాణాలు మార్కెట్ చుట్టూ ఉన్నాయి. ఇలా పదిహేను వందలపైగా దుకాణాలతోపాటు మార్కెట్ నుంచి అన్ని దిక్కులకు పరిధిని ఏర్పాటు చేసి ఆశీలు పాట నిర్వహించారు. కానీ కాంట్రాక్టరు టర్నర్ చౌల్ట్రీ నుంచి టౌన్‌కొత్తరోడ్డు వరకు వ్యాపారుల వద్ద ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక, సిమెంట్, పిక్క తీసుకువచ్చే లారీల వద్ద మరింత ఎక్కువ మొత్తంలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందా నడుస్తుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకపోయినా.. కమిషనర్ నుంచి అధికారికంగా ఉత్తర్వులు రాకపోయినా.. ఆశీలు కాంట్రాక్టు దక్కించుకున్న టీడీపీ చోటా నేత వసూళ్లు చేసేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందినా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పైగా వసూలు చేస్తున్న ఆశీలు మొత్తాన్ని తమకే ఇస్తున్నారంటూ స్థానిక జోనల్ అధికారులు కాపాడే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. జీవీఎంసీ లోగోను, కమిషనర్ పేరును అనధికారికంగా వాడుకుంటున్న నేపథ్యంలో ఫిర్యాదు చేసి.. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీసం పట్టించుకోకపోవడం విమర్శలపాలవుతోంది. మరోవైపు పూర్ణామార్కెట్‌లోని ప్రైవేటు షాపులు కూడా ఆశీలు చెల్లించాలంటూ హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ నెలవారీగా ఇవ్వకపోతే.. షాపులకు వచ్చే వాహనాలను నిలుపుదల చేసి సరుకు రాకుండా చేస్తామని బెదిరింపులకు కూడా దిగినట్టు సమాచారం. అంతేకాకుండా చేపల మార్కెట్‌కు వెళ్లే బుట్టలకు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఆశీలు వసూలు చేయడం ప్రారంభించారు. ఆది, మంగళవారాల్లో జరిగే ఈ చేపల మార్కెట్ నుంచి ఆశీలు వసూలు.. కాంట్రాక్టరు పరిధిలోకి రాకపోయినప్పటికీ వసూళ్లకు తెగబడుతున్నారు. మొత్తంగా పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందా అంతులేకుండా సాగుతున్నప్పటికీ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనీసం ఫిర్యాదు లేదు

వాస్తవానికి ఆశీలు రశీదుపై అనధికారికంగా జీవీఎంసీ అధికారిక లోగోను ముద్రించినందుకు.. జీవీఎంసీ అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమో.. ఆశీలు వసూలు చేస్తున్న వ్యక్తులపై నేరుగా చర్యలు తీసుకోవడమో చేయాల్సి ఉంది. అయితే జీవీఎంసీ అధికారులు ఆ విషయాన్ని కనీసం పట్టించుకోవడం లేదు. పైగా పార్కింగ్ రుసుం వసూలు చేసి ఆ మొత్తాన్ని తమకే ఇస్తున్నట్టుగా చెబుతూ జీవీఎంసీ అధికారులు వెనకేసుకొస్తున్నట్టు తెలుస్తోంది. జీవీఎంసీ అధికారులు చేష్టలుడిగిన నేపథ్యంలో నేరుగా పోలీసు కమిషనర్ రంగంలోకి దిగి.. అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులను తొలగించాల్సి వస్తోంది.

గెజిట్ రేట్లకు మించి వసూలు

	నిర్ణయించిన ధర	వసూలు చేస్తున్న ధర
జంగిడ	రూ. 10	రూ.200కిపైగా
ద్విచక్రవాహనం	రూ.5	రూ.10
4 చక్రాల వాహనాలకు	రూ.10	రూ.20



అధికార పార్టీ కాంట్రాక్టరు కావడంతో..

గతంలో కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తికి.. స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించలేదంటూ సుమారు రెండు నెలల పాటు ఆశీలు వసూలును అప్పగించలేదు. జీవీఎంసీ జోనల్ అధికారులే వసూలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా కాంట్రాక్టు.. టీడీపీ చోటా నేతకు వచ్చిందనే సమాచారంతోనే ఆశీలు వసూలును అప్పగించారు. ఇంకా ఈ కాంట్రాక్టుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా జీవీఎంసీ కమిషనర్ నుంచి అధికారికంగా కాంట్రాక్టు లభించినట్టు ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. అయినప్పటికీ స్థానిక వార్డు టీడీపీ చోటా నేత బుచ్చా శ్రీనుకు రూ.81 లక్షలకు కాంట్రాక్టు దక్కడంతో అధికారులు కూడా కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. జీవీఎంసీ లోగోతో ప్రైవేటు వ్యక్తులు ఆశీలు వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీనిపై గతంలో ఆశీలు కాంట్రాక్టరు శ్రీరామమూర్తి జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అనధికారిక వసూళ్లు మాత్రం ఆగడం లేదు. పైగా ప్రైవేటు వ్యక్తులు ఆశీలు వసూలు చేసి తమకు ఇస్తున్నారంటూ జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది పేర్కొంటూ.. కాంట్రాక్టరును కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

చిరువ్యాపారులను దోచుకుంటూ..

పూర్ణామార్కెట్‌లో జంగిడలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి రూ.200 నుంచి రూ.300కిపైగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే పార్కింగ్ స్థలాల్లో దుకాణాలు పెట్టించి అత్యధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌కు రావాలంటే సరుకులు కొనుగోలు కంటే ఆశీలుకే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు.

అవిశ్వాసం వీగిపోతుంది

- జీవీఎంసీలో కూటమికి బలం లేదు
- అయినా అవిశ్వాసంతో కుట్రలకు పాల్పడుతోంది
- నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ వ్యవహరించాలి
- కౌన్సిల్ సమావేశం జరగకుండా తీర్మానం నోటీసు ఎలా ఇస్తారు
- మరో ఏడాదిపాటు మేయర్‌గా హరివెంకటకుమారి కొనసాగుతారు
- మీడియాతో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ మేయర్‌పై కూటమి పార్టీలు పెట్టిన అవిశ్వాసం వీగిపోతుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. జీవీఎంసీలో కూటమి పార్టీలకు తగిన సంఖ్యాబలం లేకున్నా అవిశ్వాసం నోటీసులు ఇచ్చారని తెలిపారు. దీనికి ఈ నెల 19వ తేదీన అవిశ్వాస తీర్మానానికి తెరపడనుందన్నారు. మరో ఏడాది పాటు జీవీఎంసీ మేయర్‌గా హరి వెంకట కుమారినే కొనసాగనున్నారన్నారు. శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరగకుండా తీర్మానం చేసినట్టు కార్పొరేటర్లకు ఎలా నోటీసులు ఇస్తారని కలెక్టర్‌ను ప్రశ్నించారు. అయితే ఈ ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగానే కలెక్టర్/ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేందిర ప్రసాద్ వ్యవహరించాలని సూచించారు. ప్రజాబలంతో నెగ్గి వైఎస్సార్‌సీపీ మేయర్ పీఠాన్ని దక్కించుకుందని, అలాంటి మేయర్‌పై కూటమి పార్టీలకు తగిన సంఖ్యా బలం లేకున్నా అప్రజాస్వామికంగా పెట్టే అవిశ్వాసానికి కుయుక్తులు పన్నుతోందన్నారు. అధికార బలంతో ఏమైనా చేయవచ్చు అనే వక్రబుద్ధితో కూటమి నేతలు.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ కార్పొరేటర్లు లొంగలేదు.. ఎందుకంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానమని స్పష్టం చేశారు. ఇప్పటికే స్థానిక ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేయాలని చూసినా అవి ఫలించలేదన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నేతలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లోనే వైఎస్సార్ సీపీ ఎప్పుడూ నడుస్తుందన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితం, సందేశాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయ్ చందర్, కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ ముఖ్య నాయకులు జహీర్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధులు మొల్లి అప్పారావు, అహ్మద్, అల్లంపల్లి రాజుబాబు, జిల్లా కమిటీ సభ్యులు మంచా మల్లేశ్వరి, పతివాడ కనకరాజు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, మారుతి ప్రసాద్, కర్రి రాంరెడ్డి, సేనాపతి అప్పారావు, దేవరకొండ మార్కండేయులు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫ్, పార్టీ నాయకులు బొండా శీను, పత్తిపాడు వెంకటలక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

రామానాయుడు స్టూడియోకు త్వరలో నోటీసులు

- కేటాయింపునకు విరుద్ధంగా భూ వినియోగంపై ప్రభుత్వం చర్యలు
- కలెక్టర్ హరేందిర ప్రసాద్ వెల్లడి

మహారాణిపేట: విశాఖలో సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూముల్లో కొంత భూమి దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు రావడంతో ఆ భూములకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటీసులు జారీ చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మధురవాడ సర్వే నెంబర్ 336/పిలో 34.44 ఎకరాల భూమి సురేష్ ప్రొడక్షన్స్ కోసం కేటాయించింది. ఎకరానికి రూ.5.2 లక్షల ధర నిర్ణయించింది. ఇక్కడ కొంత భూమిలో రామానాయుడు స్టూడియో నిర్మించారు. మిగిలిన భూముల్లో లే అవుట్ వేయాలని నిర్ణయించా రు. దాని కోసం 2023లో సురేష్ ప్రొడక్షన్ పేరిట వీఎంఆర్డీఏకు, జీవీఎంసీకి దరఖాస్తులు చేశారు. అలాగే భూమి మార్పిడి కోసం వీఎంఆర్‌డీఏకు మరో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకున్నా భూమిని చదును చేసి లే అవుట్లుగా మార్చేసి ప్లాట్లుగా విభజించే ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లడంతో కూటమి సర్కార్ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను నివేదిక ఇవ్వాలని కోరింది. దీనిపై కలెక్టర్ నివేదిక తయారు చేసి పంపారు. 15.17 ఎకరాల్లో లే అవుట్ వేసిన మాట వాస్తవమేనని కలెక్టర్ తేల్చడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో కలెక్టర్ సురేష్ ప్రొడక్షన్స్‌కు నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసు జారీ చేసిన తర్వాత వారి నుంచి వచ్చిన సమాధానాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. వారి సమాధానం సంతృప్తికరంగా లేకుంటే భూములు వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు.

యూత్ పార్లమెంట్‌లో లాస్యప్రియ జయకేతనం



ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థిని విజేతగా నిలిచింది. ఉత్తమ జవాబు విభాగంలో రాష్ట్రానికి చెందిన వి.లాస్య ప్రియ విజేతగా నిలిచారు. ఈ నెల 2, 3 తేదీల్లో పార్లమెంట్ లైబ్రరీ హాల్‌లో జరిగిన జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి లాస్య, శివానీ, జ్యోత్స్న పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 110 మంది పాల్గొనగా మన రాష్ట్రం నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ఈ ముగ్గురు విద్యార్థులు విశాఖ నోడల్ ఏరియావారు కావడం గమనార్హం. వీరికి కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజేతను నెహ్రూ యువ కేంద్రం ఉప సంచాలకుడు జి.మహేశ్వరరావు అభినందించారు.

దేశాభివృద్ధిలో సముద్ర రంగం కీలకం


మారీటైమ్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, పోర్టు అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచ వాణిజ్యంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధిలో సముద్ర రంగం ముఖ్య భూమిక పోషిస్తోందని విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా. ఎం. అంగముత్తు అన్నారు. 62వ నేషనల్ మేరీటైమ్ దినోత్సవం పోర్టులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. ఎం. అంగముత్తు, సముద్రరంగంలో విధులు నిర్వర్తించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళి అర్పించారు. అనంతరం పోర్ట్ టగ్ ఫ్లోటిల్లా ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించారు. చైర్మన్ మాట్లాడుతూ.. నౌకాయాన, సముద్ర రవాణా రంగాలు దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, అంతర్జాతీయ స్థాయికి సామర్థ్యాన్ని పెంపొందించడంలో విశాఖపట్నం పోర్ట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మేరీటైమ్ డే సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేశ్ మిత్తల్, హెచ్ఐఎంటీ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్‌తో పాటు పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అన్నారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. దేశానికి ఎన్నో మహోన్నతమైన సేవలు అందించారని తెలిపారు. కేంద్ర కార్మిక మంత్రిగా అమలు చేసిన కార్మిక చట్టాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయని, కార్మిక సంక్షేమానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు దళిత ప్రజల కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన ఎనలేని కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బి.కల్యాణ్‌రామ్, విదసం ప్రెసిడెంట్ వెంకటరావు, ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, డీవీఎంసీ సభ్యులు పూండి మల్లేశ్వరరావు, డి. రాజబాబు, చొక్కాకుల రాంబాబు, ఎమ్మార్పీఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ కొనలేదని యువకుడి ఆత్మహత్య

సీతంపేట: బైక్ కొనుక్కోవడానికి తల్లిదండ్రులు డబ్బులివ్వలేదని తాగుడుకు బానిసైన ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామా టాకీస్ సమీపంలో శ్రీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనగర్‌లో సరయు అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పట్నాల రాము తన భార్య పిల్లలతో అక్కడ నివసిస్తున్నాడు. అతనికి కుమారుడు కార్తీక్ (18) తాగుడుకు బానిసయ్యాడు. రోజూ తాగి ఇంటికి వచ్చి బైక్ కొనేందుకు డబ్బులు ఇమ్మని తల్లిదండ్రులతో గొడవపడుతూ ఉండేవాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తాగి వచ్చిన కార్తీక్ బైకు విషయమై గొడవపడ్డాడు. అనంతరం గదిలోకి వెళ్లి కర్టెన్ వేసుకున్నాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు చూడగా, షెడ్డుకు ఉన్న ఐరన్‌రాడ్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దింపి చికిత్స కోసం అపూర్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో వైద్యులు పరీక్షించి కార్తీక్ చనిపోయినట్టు నిర్ధారించారు. ద్వారకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీ..జే జైలు


బెంచీలకు పెయింటింగ్ వేస్తున్న ఖైదీలు


ఖైదీలు నేసిన దర్రీలు, ఫుట్‌మేట్‌లు


స్టీల్ పరికరాల కంపెనీలో ఇనుప ప్లేట్ల కటింగ్ యంత్రం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం..ఖైదీలకు చెరసాలే కాదు...పలు రకాల కర్మాగారాల నిలయం. వీటిలో శ్రమించి, అందుకు తగిన ప్రతిఫలం పొందేది బయటివారు కాదు. ఇక్కడ శిక్షను అనుభవిస్తున్న ఖైదీలే. సత్ప్రవర్తన అలవరిచేలా జైళ్ల శాఖ ఇక్కడి పరిశ్రమల్లో ఖైదీలకు చేతినిండా పని కల్పిస్తోంది. అటు ఖైదీలకు, ఇటు జైళ్ల శాఖ సంక్షేమ నిధికి ఆదాయ మార్గాలుగా ఈ కర్మాగారాలు నిలుస్తున్నాయి.

చీపుళ్ల నుంచి బేకరీ ఉత్పత్తుల దాకా...

ఇక్కడ ఇళ్లు ఊడ్చుకొనే చీపుర్ల నుంచి కుర్చీలు, టేబుళ్ల వరకు తయారవుతున్నాయి. స్టీల్ పరికరాలు, వ్యవసాయం, పాడి పరిశ్రమ, బుక్ బైండింగ్, చేనేత బట్టలు, బేకరీ ఉత్పత్తులను తయారుచేస్తుంటారు. కర్మాగారాల్లో ఖైదీలే కార్మికులుగా కనిపిస్తారు. వారు జైల్లో శిక్ష అనుభవిస్తున్నామనే భావం లేకుండా, ఆడుతూ పాడుతూ పనిచేసుకుపోతున్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండించడం, నాణ్యమైన వస్తువుల రూపకల్పనలో నిమగ్నమవుతారు. జైల్లో ఉన్న కర్మాగారాలతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2 కోట్ల విలువైన ఉత్పత్తులను ఇక్కడి ఖైదీలు తయారు చేశారు. జైల్‌లో వినియోగించగా మిగిలిన వాటిని బయట విక్రయిస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని ఇతర జైళ్లకు సరఫరా చేస్తున్నారు.

ఉత్పత్తులు..ఆదాయమార్గాలు

- ఇక్కడ సుమారు 200 మంది ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారు. వీరంతా వారి శక్తి సామర్థ్యాల మేరకు పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. పని ఆధారంగా వేతనాలు చెల్లిస్తారు. విడుదల సమయంలో ఆ నగదును వారికి అందిస్తారు.
- స్టీల్ యూనిట్‌లో బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు, బీరువాలు, ఆస్పత్రుల్లో వినియోగించే పడకలు, ర్యాక్స్, పాఠశాల విద్యార్థులు కూర్చునే బెంచీలను తయారు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు వాటిని ముందుగానే బుక్ చేసుకుంటాయి.
- ఇక్కడ సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తారు. మామిడి, కొబ్బరి ఉత్పత్తవుతోంది. వీటిని ఖైదీలకు వినియోగించగా మిగిలినవి సుధార్ కేంద్రంలో బయటి వ్యక్తులకు విక్రయించడం ద్వారా లాభం చేకూరుతోంది.
- పాడి విషయానికి వస్తే..మేలు జాతి రకాలకు చెందిన 14 ఆవులు, 10 గేదెలున్నాయి. వాటి నుంచి వచ్చిన పాలను ఖైదీలకు వినియోగిస్తున్నారు. –జైల్లో బేకరీ ఉత్పత్తులకు వీటి పాలే వాడతారు.
- చేనేత యూనిట్లో బెడ్ షీట్స్, తువ్వాళ్లు తయారు చేస్తారు. వీటిని ఖైదీలకు వినియోగించగా మిగిలినవి సుధార్ కేంద్రంలో విక్రయిస్తున్నారు.
- టైలరింగ్ యూనిట్‌లో టీ–షర్ట్స్, షార్ట్స్ తయారవుతున్నాయి.
- బుక్ బైండింగ్ యూనిట్‌లో పుస్తకాలకు ఎక్కువగా కోర్టుల నుంచి ఆర్డర్లు వస్తుంటాయి.
- దర్రీ యూనిట్లో తయారైన రగ్గులు, తివాచీలను ఖైదీలకు, గార్డింగ్ సిబ్బందికి సరఫరా చేస్తున్నారు.
- బేకరీ ఉత్పత్తులను ఖైదీలను కలుసుకునేందుకు వచ్చిన వారికి విక్రయిస్తుంటారు.

జైల్లో ఉన్నా.. కుటుంబాలకు అండగా..



జైల్లో శిక్ష అనుభవిస్తున్న కాలంలో ఖైదీలకు చేతినిండా పని ఉంటుంది. జైల్లో ఉన్నప్పటికీ వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేలా ఆదాయం సమకూరుస్తున్నాం. వారికి ఆదాయ మార్గాలను పెంచుతాం. తయారీ రంగాల్లో ఉత్పత్తులను మరింత పెంచే దిశగా ప్రణాళిక రచిస్తున్నాం.

–ఎం.మహేష్‌బాబు, పర్యవేక్షణాధికారి, విశాఖ కేంద్రకారాగారం

126 కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు, ఇద్దరు పరారీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ-2 డి.మేరీ ప్రశాంతి

అల్లిపురం: ఏజెన్సీ ప్రాంతం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని దువ్వాడ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరి పరారవ్వగా, 126 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర శాంతిభద్రతల డీసీపీ-2, డి.మేరీ ప్రశాంతి వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో దువ్వాడ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గంజాయి బీట్ సిబ్బంది కూర్మన్నపాలెం, స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోవద్ద నిఘా వేశారు. దీంట్లో భాగంగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గమనించారు. వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 6 బ్యాగులలో 126.940 కేజీల గంజాయి, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ ఢిల్లీకి చెందిన భరత్ సింగ్, రాజ్ సింగ్‌లు ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో బట్టల వ్యాపారం చేస్తుంటారు. రాజ్‌సింగ్ స్నేహితుడు అమిత్ కుమార్ సింగ్ ముందుగా విశాఖ చేరుకున్నాడు. ఇక్కడ రూం అద్దెకు తీసుకుని బట్టల వ్యాపారం చేస్తున్నట్టు నటిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి కొనుగోలు చేశాడు. పని పూర్తయిన తరువాత తన మిత్రులైన భరత్‌సింగ్, రాజ్‌సింగ్‌ను విశాఖ రమ్మన్నాడు. వీరు ముగ్గురూ గంజాయితో ఢిల్లీ వెళ్లేందుకు కూర్మన్నపాలెంలో ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎక్కేందుకు ఆటోలో వేచి ఉండగా పోలీసులు వారిని చుట్టుముట్టారు. అయితే వారిలో అమిత్‌సింగ్, రాజ్‌సింగ్ పరారవగా..భరత్‌సింగ్ మాత్రం పోలీసులకు దొరికిపోయాడు. అతని నుంచి 126.940 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మార్చిలో కూడా ఒకసారి ఢిల్లీకి గంజాయి తరలించినట్టు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితులకు రిమాండ్

ఆరిలోవ: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రాంతం చీపురువలసలో వెలుగు చూసిన ఓ మహిళ హత్య కేసులో ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితుడికి సహకరించిన మరో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరిగింది. మహిళను హత్య చేసి ఆ మృతదేహాన్ని సాలూరు ప్రాంతం చీపురువలసకు స్నేహితుడి సాయంతో గత నెల 28 రాత్రి బైక్‌పై 100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి తరలించిన విషయం తెలిసిందే. దీంతో సంచలనంగా మారిన ఈ కేసుపై పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ అధికారుల సూచనలతో ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐలతో కలిసి శనివారం పైనాపిల్‌కాలనీలో హత్య జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. నిందితుడు ఎప్పటి నుంచి ఇక్కడ ఉంటున్నాడు, ఏ పని చేసేవాడో చుట్టుపక్కలవారిని ఆరా తీశారు. దీనిపై ఆరిలోవ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి పైనాపిల్‌కాలనీ దరి హుదూద్ సముదాయంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాము మెకానిక్ షాపులో పనిచేసేవాడు. ఐశ్వర్యతో గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నాడు. పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య ఒత్తిడి తెచ్చింది. పెళ్లికి ఇష్టం లేని రాము ఆమె ఉంటున్న ఇంట్లో గొంతు నులిమి హత్య చేశాడు. ఆ శవాన్ని బైక్‌పై తన స్నేహితుల సహాయంతో చీపురువలస తీసుకువెళ్లి అక్కడ ఓ మామిడితోటలో చెట్టుకు ఉరి వేసుకున్నట్లు వేలాడదీశారు. మృతదేహాన్ని తరలించేందుకు సహకరించిన మజ్జి వల్లయ్య అలియాస్ సాయి, తాటిచెట్లపాలానికి చెందిన సీహెచ్.శంకర్‌లను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించామని పోలీసులు వెల్లడించారు.

డిప్యూటేషన్ జీతం కనకమహలక్ష్మి ఆలయానికి చెల్లించండి



మహారాణిపేట: శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానానికి చెందిన ఋుగ్వేద పండితుడు వి.ఎస్.హనుమాన్ శర్మ డిప్యూటేషన్‌పై కొంతకాలంపాటు శారదా పీఠంలో పనిచేశారు. ఆ కాలానికి తీసుకున్న జీతం రూ.37.15 లక్షలు తిరిగి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి చెల్లించాలని శ్రీ కనకమహాలక్ష్మి దేవాలయం ఈవో శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చెల్లింపులు 15 రోజుల్లోగా చేపట్టాలని పేర్కొన్నారు.



ఆపరేషన్ ఫిష్

ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం పక్షులు సందడి చేశాయి. మొసళ్లకు వాటి కొలనులో జూ సంరక్షకులు ఆహారంగా వేసిన చేపలను ఎత్తుకుపోయి సందర్శకులను కనువిందు చేశాయి. జూ సాగర్ ద్వారం వద్ద ఘరియల్ జాతి మొసళ్లు కొలనులో వాటికి సంరక్షకులు ఆహారం కోసం రోజూ చేపలు వేస్తుంటారు. వాటికి వేసిన ఆహారాన్ని బయట చెట్లపై తిరిగే కొంగలు, అదే జాతికి చెందిన పెయింటెండ్ స్టాక్స్ ఎత్తుకుపోయి ఆకలి తీర్చుకొంటున్నాయి. రోజూ మాదిరిగా శనివారం మధ్యాహ్నం సమయంలో ఘరియల్స్ కోసం వేసిన చేపలను వేటాడడానికి కొంగలు, పెయింటెండ్‌స్టోక్స్‌కు రాబందులు తోడయ్యాయి. ఇవి పెద్ద పక్షులు కావడంతో కొంగలను పక్కనబెట్టి కొలనులో చేపలను వాటి కాళ్ల గోళ్ల మధ్య ఇరికించి పైకి ఎత్తుకుపోయి చక్కగా ఆకలి తీర్చుకొన్నాయి. పాపం రోజు మాదిరిగా కాపలా కాచిన కొంగలకు మాత్రం చేపలు దొరకలేదు. రాబందు తన కాళ్ల గోళ్ల మధ్య చేపలను పట్టుకొని వెళుతుంటే కొంగలు చూస్తూ ఉండిపోయాయి.

–ఆరిలోవ/ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలరించిన జంతువులు

ఇందిరాగాంధీ జూ పార్కు శనివారం సందడిగా మారింది. ఎండ తీవ్రత కావడం, పాఠశాలలు, కళాశాలలకు సెలవు కావడంతో చల్లదనం కోసం అధిక సంఖ్యలో జూను సందర్శించారు. ఇక్కడ జంతువులు వాటి ఎన్‌క్లోజర్లలో సందడి చేస్తూ అలరించాయి. నీటి ఏనుగులు, తెల్ల పులులు, కృష్ణ జింకలు, ఖడ్గ మృగం, కనుజులు, ఏనుగులు, అడవిదున్నలు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకు లను కనువిందు చేశాయి. నీటి ఏనుగు తన పెద్ద నోటిని తెరిచి ఏదైనా మింగేయగలను అన్నట్లు సందర్శకులను భయపెట్టింది. తెల్లపులులు, సింహాలు గాండ్రింపులతో జూలో హోరెత్తించాయి. చుక్కల జింకలు, కృష్ణ జింకలు, కనుజులు వాటి ఎన్‌క్లోజర్లలో గుంపులుగా తిరుగుతూ సంరక్షకులు వాటికి వేసిన ఆహారం తింటూ సందడి చేశాయి.

–ఆరిలోవ/ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

